

లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్ దంపతులు

ఎమ్మెల్యే గంగులకు పరామర్శ

కార్పొరేషన్, అక్టోబర్ 27: కరీంనగర్ శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ దంపతులు, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, మాజీ మేయర్ డి. శంకర్, మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి పరామర్శించారు. అలాగే గంగుల మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, అక్టోబర్ 27: నగరంలోని 33కేవీ సప్తగిరి ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 10గంటల వరకు కశ్మీర్‌గడ్డ, తెలంగాణ చౌక్, ముకరంపుర, గోదాంగడ్డ, భగత్‌నగర్, మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, రాంచంద్రాపూర్ కాలనీ, శివనగర్, ఏవోస్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

వీణవంక, అక్టోబర్ 27: మండల కేంద్రంలో మేదర సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించుకునే పలు వేడుకలకు సౌండ్ బాక్స్‌ల కోసం యప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్ నందన్‌రెడ్డి ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటారు. ఆదివారం తన సిబ్బంది ద్వారా మేదర సంఘం అధ్యక్షుడు కూచనపల్లి రాజు, కులపెద్దలకు రూ.20 వేల నగదు అందజేశారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, యప్‌టీవీ సిబ్బంది వెన్నంపల్లి నారాయణ, కుమారస్వామి, లోకేశ్, అశోక్, వంశీ, సంతోష్, నాయకులు అమృత ప్రభాకర్, సమిండ్ల ప్రకాశ్, సాంబయ్య, రాజమౌళి, సారయ్య, మల్లయ్య, రాములు ఉన్నారు.

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఉప్పరమల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, అక్టోబర్ 27: రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పర మల్యాల, రంగారావు పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని, తేమశాతం వచ్చిన ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం తీసుకోవడంలో మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు కర్ర బాపురెడ్డి, ముద్దం నగేశ్, సత్తు కనకయ్య, గుజ్జుల బాపురెడ్డి, కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, గడ్డం అంజయ్య, బైరిశెట్టి సంపత్, కర్ర కార్తీక్‌రెడ్డి, రుద్ర మల్లేశం, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ దాతలకు అభినందన

మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన చిప్ప కళావతి, సత్యనారాయణ తమ అక్క చిప్ప భూదేవి జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి బాడీ ఫ్రీజర్‌ను వితరణ చేయగా, దాతలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం గ్రామ పంచాయతీ వద్ద సన్మానించి అభినందించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు కర్ర బాపురెడ్డి, ముద్దం నగేశ్, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, ఆళ్ల విజేందర్‌రెడ్డి, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగులను మోసగించిన ప్రభుత్వం

- మాజీ మేయర్ రవీందర్ సింగ్

కార్పొరేషన్, అక్టోబర్ 27: ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా, అందులో మూడు డీఏలు చెల్లిస్తామని నిన్నటి వరకు నమ్మబలిన రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మాత్రం కేవలం ఒక డీఏకు మాత్రమే ఆమోదం తెలుపడం ఉద్యోగులను మోసం చేయడమేనని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ దుయ్యబట్టారు. ప్రభుత్వ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఆమోదించిన డీఏను ఇప్పుడు విడుదల చేసి ఏదో గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు పీఆర్సీ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తున్నదని పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించిన హెల్త్ కార్డ్స్, సీపీఎస్ లాంటి సమస్యలపై సబ్ కమిటీ వేసి చేతులు దులుపుకొన్నారని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విమర్శించారు.

రెడ్డి జేఏసీ మండల నూతన కమిటీ

చిగురుమామిడి, అక్టోబర్ 27: రెడ్డి జేఏసీ మండల నూతన కమిటీని మండల కేంద్రంలోని డార్విన్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కల్వల రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కరివేద మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంకు శ్రీనివాస్ రెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాటికొండ సంజీవరెడ్డి, గౌరవాధ్యక్షులుగా చీల లక్ష్మీ రెడ్డి, గాదే రఘునాథరెడ్డి, సింగిరెడ్డి స్వామి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు పెండ్యాల రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జున్నుతుల రాజిరెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చుక్కారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దారం జగన్నాథరెడ్డితో పాటు రెడ్డి నాయకులు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, రెడ్డి సంఘ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ఇల్లందకుంట, అక్టోబర్ 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల సమన్వయ కమిటీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పేదల పక్షాన దేశవ్యాప్తంగా నిరాటంకంగా పోరాడుతున్నది ఎర్ర జెండానేనన్నారు. బీజేపీ పాలనలో దేశంలోని మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, లైంగిక వేధింపులు, హింస పెరుగుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, 10 నెలలు దాటినా వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇక్కడ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అశోక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్, నాయకులు శ్రీకాంత్, సంతోష్, మల్లయ్య, రాజేందర్, ఓదెలు, సంపత్, మల్లేశ్, విక్రమ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 27: రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఐకేపీ సెంటర్లు, ప్రాథమిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అన్ని సెంటర్లకు మిల్లులు అలాట్‌మెంట్ చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాముల కుమార్, ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి, కార్యదర్శి చీదురాల శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా మండలాధ్యక్షుడు నరేడ్ల చైతన్య రెడ్డి, ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు మండల సాయిబాబా, సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ పంజాల వెంకన్న గౌడ్, చెల్పూర్ నాలుగో బూత్ అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న వీర్ల దంపతులు

రామడుగు, అక్టోబర్ 27 : రామడుగు సింగిల్‌విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, కవిత దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించారు. స్వామివారిని ప్రత్యేకంగా దర్శించుకొని, వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, కవిత దంపతులు

పండ్లు పంచి.. పూజలు చేసి..

రామడుగు, అక్టోబర్ 27: బీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, కవిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ రామడుగు మండల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వృద్ధులు, అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లంక మల్లేశం, ఆర పెల్లి ప్రశాంత్, ప్రహ్లాద్, శివకుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం ఎదుట వృద్ధురాలికి పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులు

సాగి మహిపాల్‌రావు

గంగాధర, అక్టోబర్ 27: గంగాధర మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారం రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం మిల్లులను కేటాయించకపోవడంతో ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదని తెలిపారు. అకాల వర్షాలు పడే ఆస్కారం ఉన్నందున రైతులు తక్కువ ధరకు కల్లాల వద్దను వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ధాన్యం ఎప్పుడు తూకం వేస్తారో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని, త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు ఇబ్బంది పడకుండా సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరిగాయని గుర్తు చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, రైతుల ఇబ్బందులను తీర్చాలని కోరారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, అక్టోబర్ 27: దీపావళి, కార్తీక పౌర్ణమి పండుగల సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 16 వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

రమ్యకృష్ణకు ప్రజాప్రతినిధుల నివాళి

రామడుగు, అక్టోబర్ 27 : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు సతీమణి రమ్యకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, ఆదివారం పెద్దకర్మ నిర్వహించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, సుద్దాల దేవయ్య తదితరులు హాజరయ్యారు. రమ్యకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ పలు పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారు.

ఉత్సాహంగా 2కే వాక్

2కే వాక్‌లో పారమిత పాఠశాల విద్యార్థులతో చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు

కొత్తపల్లి, అక్టోబర్ 27 : పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 2కే వాక్ ఉత్సాహంగా సాగింది. మానేరు డ్యాం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని, జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం యోగా, వాకింగ్ లాంటివి చేసినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని, ఏదైనా సాధించే సత్తా ఏర్పడుతుందన్నారు. వాక్‌లో భాగంగా హెల్త్ క్లబ్ విద్యార్థులు సందేశాత్మక పోస్టర్లు, కరపత్రాలను రూపొందించి ప్రదర్శించారు. ఈ వాక్‌లో డైరెక్టర్లు అనూకర్‌రావు, రమణ, హన్మంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి అండగా నిలిచిన సామాజికవేత్త

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 27: నిండు గర్భిణికి రక్తం సమకూర్చడంతో పాటు ఆమె సుఖ ప్రసవం కావడానికి ఏర్పాట్లు చేసి సహృదయతను చాటుకున్నారు సామాజిక వేత్త, జెన్ ప్యాక్ట్ వైస్ చైర్మన్ సబ్బని వెంకట్. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన దుబాసి వెన్నెల పురిటినొప్పులతో అపస్మారక స్థితిలో డెలివరీ కోసం హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లింది. హాస్పిటల్‌లో క్రిటికల్ కేర్ సదుపాయాలు లేవని సిబ్బంది చెప్పడంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని మిషన్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ రక్తం అవసరం కావడంతో కాంగ్రెస్ నాయకురాలు వేముల పుష్పలత సబ్బని వెంకట్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే రక్తాన్ని సమకూర్చడంతో పాటు, మిషన్ హాస్పిటల్ సూపరింటెండెంట్, సిబ్బందితో మాట్లాడి సర్జరీకి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయించారు. సర్జరీ సజావుగా జరిగి, వెన్నెల పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. సకాలంలో స్పందించి నిండు గర్భిణికి అండగా నిలిచిన సబ్బని వెంకట్ సహృదయతకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... హుజూరాబాద్‌లో వంద పడకల దవాఖానలో మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 27: గట్టుదుద్దెనపల్లి కెనాల్ సమీపంలో ఆటో బోల్తాపడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. ఆదివారం కరీంనగర్ నుంచి కేశవపట్నం వస్తున్న ఆటో గట్టుదుద్దెన పల్లి కెనాల్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తాడికల్ గ్రామానికి చెందిన డ్రైవర్ గడ్డి కుమారస్వామికి తీవ్ర గాయాలపాలు కాగా, చింతకుంట గ్రామానికి చెందిన మహ్మద్ ఖాజా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా, ఈఎంటీ సతీశ్ రెడ్డి, పైలెట్ ఖాజా ఖలీల్ ఉల్లా ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుల్ని అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందిస్తూ, కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

నేడు బహుమతుల ప్రదానోత్సవం

చిగురుమామిడి, అక్టోబర్ 27: మండల కేంద్రంలో 20 రోజులుగా పోలీస్ స్టేషన్ ఎదురుగా నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ ఫైనల్ ముగింపు కార్యక్రమం సోమవారం జరుగనున్నది. దీనికి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ హాజరై, విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అక్రమంగా నిల్వ చేసిన పటాకుల సీజ్

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 27: పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.నాలుగు లక్షలకు పైగా విలువ చేసే పటాకులను పోలీసులు పట్టుకున్నారు. సీఐ తిరుమల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చుక్కారపు యాదగిరి ఎలాంటి అనుమతులు లేకుండా పటాకులను ఇంట్లో నిల్వ చేయగా, సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. దాదాపు రూ. 4,37,000 విలువైన పటాకులను గుర్తించి సీజ్ చేసినట్టు సీఐ వెల్లడించారు.

అధికారులపై ఫిర్యాదు

జమ్మికుంట, అక్టోబర్ 27: తనకు సంబంధించిన భూమి తనది కాదంటూ స్థానిక అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఒక ప్రణాళికా ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారంటూ.. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన కాటిపెల్లి రాజు కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేశారు. ధర్మారం శివారులో 6గుంటల భూమిని కొనుగోలు చేశానని, భూమితో సంబంధం లేని వ్యక్తులు కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారని అందులో పేర్కొన్నారు. స్థానిక, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశానని, భూమిని తాను చదును చేసుకుంటున్న సమయంలో సీఐ కేసు నమోదు చేశారని తెలిపారు. తాను కొనుగోలు చేసిన భూమి పత్రాలు ఫోర్జరీవని తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదుతో మరో రెండు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. భూపత్రాలను సైతం చూడకుండా ఒక వర్గం వారికి అధికారులు సపోర్టు చేస్తున్నారని, నిజాలను వెలికి తీసి న్యాయం చేయాలని అందులో విజ్ఞప్తి చేశారు.

మిత్రబృందం ఔదార్యం

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 27: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన కుక్క రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి అతడి మిత్రబృందం అండగా నిలిచింది. రాజయ్యతో కలిసి మానకొండూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86 పదో తరగతి చదివిన వారంతా కలిసి రూ.14,601 పోగు చేశారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసి భరోసా కల్పించారు. కార్యక్రమంలో కొండ్ర శంకర్, పూసాల వేణు, మామిడి మహేందర్, శ్రీధర్, వెంకటస్వామి, మల్లయ్య, చంద్రమౌళి, రాజిరెడ్డి, భాషబోయిన అంజయ్య, ఓదయ్య, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

వీణవంక, అక్టోబర్ 27: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని మండలానికి చెందిన ఉద్యమకారులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వారు మాట్లాడుతూ, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, పెన్షన్‌ను వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు పెరుమాండ్ల సంపత్, కండె మహేందర్, సంఘి గట్టయ్య, చింతల రాజిరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

గన్నేరువరం, అక్టోబర్ 27: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, మన ఆర్థిక స్థితిగతులను మార్చేది విద్యేనని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని చీమలకుంట పల్లి గ్రామానికి చెందిన రామిడి సాగర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఇటీవల నియామకం కాగా, ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. నేటి యువత తమ శక్తిని వృథా చేసుకోవద్దని, రామిడి సాగర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సుధాకర్, శాంతాకుమార్, రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 27: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు రూ.పది లక్షల విలువ చేసే ఎల్‌వోసీలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో జన్మదిన వేడుకలు

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న లయన్స్ క్లబ్ బాధ్యులు

విద్యానగర్, అక్టోబర్ 27: లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో లయన్ మాచర్ల కిశోర్ గౌడ్, చైతన్య లత దంపతుల కుమారుడు అద్వైత్ భార్గవ్ ఐదో పుట్టినరోజు వేడుకలను ఆదివారం స్థానిక శాతవాహన యూనివర్సిటీ వద్ద గల బధిరుల (మూగ, చెవిటి) పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి, 135 మంది విద్యార్థులకు పండ్లు, కేక్, బిస్కెట్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోల్డెన్ శాతవాహన అధ్యక్షుడు లయన్ మానువాడ శంకర్, కార్యదర్శి లయన్ ననువాల గిరిధర్ రావు, కోశాధికారి లయన్ డా. కుంభోజు రమేశ్, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ పాశం నర్సింహారెడ్డి, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ చిలుపూరి రాములు, లయన్ బిరుదుల ప్రవీణ్, లయన్ కుంభోజు సమత, తిరుపతి రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, అక్టోబర్ 27: మండలంలోని కాసారం గ్రామ మాజీ ఎంపీటీసీ న్యాతని శివశంకర్ తండ్రి నర్సయ్య ఆదివారం మృతి చెందగా, కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. నర్సయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ వేముల దామోదర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఇల్లందకుంట, అక్టోబర్ 27: ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకుర్తి గ్రామానికి చెందిన సనబోయిన కవిత (43) ఈనెల 21న పత్తి తీసేందుకు ట్రాక్టర్‌లో వెళ్లింది. ట్రాక్టర్ బోల్తాపడడంతో మెడకు తీవ్ర గాయాలయ్యాయి. కవితను హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమెకు భర్త సమ్మయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమ్మయ్య ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమారస్వామిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చొక్కారావుపల్లెలో వృద్ధురాలు..

గన్నేరువరం, అక్టోబర్ 27: చొక్కారావుపల్లె గ్రామానికి చెందిన ముసుకు లచ్చవ్వ (80) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చవ్వకు నలుగురు కూతుర్లు కాగా, వృద్ధాప్యంలో ఏ అల్లుడి ఇంటికి